# రాయల్ ఫ్రెండు




చిరుచలితో వెళ్ళిపోయింది కార్తీకం! వణికించే చలిలో వచ్చింది ధనుర్మాసం! రోజు లాగే ఆ రోజు కూడ తెల్లవారు ఝామునలేచి, కళ్ళాపు చల్లి ముంగిట ముగ్గులు వేసింది రమ! క్రితం రోజు సాయంత్రం పనిమనిషి చేత తెప్పించి ఆవు పేడతో గొబ్బెమ్మలుచేసి, ముగ్గులో ఉంచి, పసుపు కుంకుమలు జల్లి, పూలతో అలంకరించింది! ఆ తర్వాత తలారా స్నానంచేసి తులసి కోటకు దీపంపెట్టి, తిరుప్పావై చదువుకుంది! అప్పటికే అయిదయింది.

తూర్పు తెల్లబడుతోంది! అలారం మ్రోగింది!రఘు నిద్రలేచాడు! బద్ధకంగా ఆవులిస్తూ, చలికి వణుకుతూ, రెండుచేతులూ ఇంటూలా మెడచుట్టలావేసుకుని వంట గదిలోకి వచ్చాడు! అటుఇటు హడావిడిగా తిరుగుతున్న భార్యను చూస్తూ "అయిందా?నీపూజ" అని అడిగాడు.

"అయిపోయింది! ఇంకొక్క అరగంటలో తయారవుతాను!" జవాబిచ్చింది రమ!

"నీ ఇష్టం! ఎంత తొందరగా తయారైతే అంత మంచిది! పది నిమిషాలు ముందే స్టేషన్లో వుండాలి! కంగారు పడ్తూ రైముకివెళ్ళి బాధపడుట కంటే ముందే వెళ్తేమంచిది! మనవూళ్ళో కోణార్క రెండు నిమిషాల కంటే ఎక్కువ సేపు ఆగదు! సరిగ్గా అయిదు నిమిషాల తక్కువ ఆరుకి వస్తుంది!" అంటూ బాత్‌రూమ్‌లోకి వెళ్ళిపోయాడు! అత్తవారింట్లో ఎదో ఫంక్షన్ వుందని, ముందుగా రమ్మని ఉత్తరంరాస్తే హైద్రాబాద్ ప్రయాణమయింది రమ! రఘు శలవు దొరకదనీ, రానని మొండికేసాడు! అత్తవారేమైనా అనుకుంటారేమోనని ఒకత్తే బయల్దేరింది! ముందుగా గోదావరిలో కాని, గౌతమిలోకానిబయల్దేరాలను కుంది! చలిలో ప్రయాణం చేయటం కష్టమని కోణార్క్‌కి బయల్దేరింది! వంటిల్లు సర్దుకుని, భర్తకు టిఫిన్‌చేసి, తయారయేసరికి అయిదున్నర అయింది! అప్పటికి అయిదు నిమిషాల క్రితమే తయారయి భార్యకోసం ఎదురుచూస్తున్నాడు రఘు!

గబగబ భర్త దగ్గరకువచ్చి, చీర కుచ్చెళ్ళు అటు ఇటు సర్దుకుంటూ "బాగుందా?" అని అడిగింది రమ!

"ఏమిటి బాగుంది? నువ్వా? చీరా?" కొంటెగా అన్నాడు రఘు! ఆ మాటలకి మూతి విరిచింది రమ!

రఘు తలుపులకు తాళం వేస్తూంటే, బయటకు నడిచి, ప్రత్యూషపు వెలుగులో తనువేసిన ముగ్గుని అపురూపంగా చూసుకుంది రమ! "ముగ్గు ఎలావుంది?" అడిగింది, బయటకు వచ్చిన భర్తను, అంతకు ముందు జరిగిన సంభాషణని గుర్తుంచుకుని జాగ్రత్తగా! రఘు రమవైపు ఆప్యాయంగా చూస్తూ, "నీ మనసు వాకిట పూచిన మధుర భావంలా వుంది" అన్నాడు రమ మురిసి పోయింది.

ఇద్దరూ స్టేషన్‌కి చేసేసరికి రైలు వచ్చేస్తోందన్న సూచనగా బెల్‌కొట్టారు! వాళ్ళు లోపలికి వెళ్ళే సరికి బండి వచ్చేసింది! రిజర్వేషన్ కంపార్ట్‌మెంట్ ఆ చివర ఉన్నదని, అపుడే ట్రైన్ దిగిన టి.సి చెప్పటంలో ఈ చివర నుంచి రిజర్వేషన్ కంపార్ట్‌మెంట్ వరకూ పరిగెత్తారు ఇద్దరూ! ఇంతలో రైలు కదిలింది! భార్యను గబుక్కున ఎత్తుకుని కంపార్ట్‌మెంట్‌లోపలికి నెట్టాడు రఘు! తలుపుకి దగ్గరగానున్న వ్యక్తి రమను పొదవి పట్టుకున్నాడు. రైలువేగం అందుకుంది! చేతులూపుతూ కనుమరుగయ్యాడు రఘు! ఎన్నడూ పరిగెత్తని తను అందరూ చూస్తూ ఉండగా ప్లాట్‌ఫాం మీద పెరుగెత్తటం, పరాయి వ్యక్తి పొదవి పట్టుక్కోవటం- తలచుకోగానే సిగ్గుతో తలవంచుకుంది రమ! "కూర్చోండి మేడమ్! రిలాక్స్ అవండి" అన్నాడు. ఇందాక రమను పట్టుకున్న వ్యక్తి! ఎక్కడన్నా కూర్చోటానికి వీలుంటుందేమోనని కంపార్ట్‌మెంట్ లోపలికి తొంగిచూసింది! ఎక్కడ చోటులేదు! ఎదురుగా! ఒక యువతి చేతులాడిస్తూ పక్కన కూర్చున్న భర్తతో కబుర్లు చెపుతోంది! అలా చేతులాడిస్తున్నపుడు ఆమె చేతికున్న గాజులు గలగల శబ్దం చేస్తున్నాయి! ఆ శబ్దం ఎంతో నచ్చింది రమకు! ఇంతలో ఆమె పక్కన కూర్చున్న భర్తలేచి ఇంకోవైపుకి నడిచాడు! వెంటనే ఆలస్యం చేయకుండా వెళ్ళి ఆ చోట్లో కూర్చుంది రమ-

"మావారు వస్తారండీ" అందాయువతి దబాయింపుగా!

"రాగానే లేస్తాను" గొణిగింది రమ!

ఎదురుగుండా సీట్లో నలుగురు యువకులు కూర్చున్నారు!

"మీరు ఎక్కడికి వెళ్ళాలి?" అడిగాడు ఒక యువకుడు రమను! "హైదరాబాద్" చెప్పింది రమ.

"మీరు ముందే సీటు రిజర్వు చేసుకోవాల్సింది! ఈ ట్రైన్ చాలా రష్‌గా వుంటుంది! టి.సి. డబ్బులు రాబట్టుకోవచ్చని దగ్గర స్టేషన్లలో దిగే వాళ్ళని కూడా ఎక్కించేస్తారు! దాంతో కూర్చోటానికి కూడా చోటుండదు"! అన్నాడు ఇంకోయువకుడు!

"అవునండీ! దూరం వెళ్ళే వాళ్ళుముందే రిజర్వు చేసుకోవాలి! అప్పటి కప్పుడు రిజర్వేషన్ కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కి రిజర్వేషన్ కావాలంటారు! ఆ టి.సి ఎంతమందికని ఇస్తాడు చెప్పండి!" అందా యువతి. రమను చురచురచూస్తూ రమకు నోటమాట రావటం లేదు! సహజంగా పిరికిదేమో వాళ్ళిలా మాట్లాడుతోంటే భయంతో చెమటలు పట్టాయామెకు! "మావారు రాగానే మీరులేవాలి!"- మళ్ళీ హెచ్చరించింది ఆ యువతి! ఇంతలో టి.సి. వచ్చాడు!

"నిడదవోలులో ఎక్కింది ఎవరమ్మా!" అన్నాడు

"నేను" అంటూ తన టికెట్ తీసి ఇచ్చింది రమ!

ఆ టికెట్ చూస్తు, రమకూర్చున్న సీటు నెంబర్ కేసి చూసాడు! రెండు ఒకటే కావటంతో, టికెట్‌ని రమకి ఇచ్చేసాడు!

"మీరమ్మా" ఆ యువతిని అడిగాడు టి.సి!

"రాజమండ్రిలో ఎక్కామండి!, అనుకోకుండా ప్రయాణం చేయవలసి వచ్చింది! రిజర్వేషన్ కావాలండీ"- అందాయువతి సిగ్గుగా!

"కుదరదమ్మా! ఒక్క సీటుకూడా ఖాళీలేదు! మీరు ఏలూరులో దిగిపోయి జనరల్ కంపార్ట్ మెంట్ ఎక్కండి"- అంటూ వెళ్ళిపోయాడు టి.సి! అప్పట వరకు రమను దబాయించిన ఆ యువతి మరి మాట్లాడలేదు! ఆ యువకులు కూడా ప్రకృతిని పరిశీలించే నెపంతో, కిటికీలోంచి బయటకు చూడసాగారు!

చిన్నగా నవ్వుకుంది రమ వాళ్ళ ప్రవర్తనను గమనించి.

అత్త... లో
...టకృష్ణమూర్తి
...సీరియల్